క్లుప్తంగా

సుధాకర్ రెడ్డి మరణం బాధాకరం

గోపాలపట్నం: మాజీ పార్లమెంట్ సభ్యుడు, సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి మరణం బాధాకరమని పీసీసీ అధికార ప్రతినిధి సోడదాశి సుధాకర్ అన్నారు. షిప్‌యార్డు ఆర్థిక కష్టాల్లో ఉన్న సమయంలో ప్రైవేటు పరం కాకుండా పోరాడారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచి సీపీఐ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిన నాయకుడని కొనియాడారు. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు.

వుడా లేఅవుట్‌కు మహర్దశ


జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో రూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం వార్డులో చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. నగరానికే మోడల్ 52వ వార్డును తీర్చిదిద్దామని తెలిపారు. తాజాగా పీపీపీ పార్క్‌లో కొత్తగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.92లక్షల మంజూరుకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. ఇదే తరహాలో పీఎఫ్ క్వార్టర్స్ నుంచి రజక వీధి మీదుగా శ్మశానవాటిక వరకు ఆర్‌సీసీ డ్రైనుకు రూ.90లక్షలు మంజూరయ్యాయన్నారు. తనకు సహకరించిన కార్పొరేటర్లు, కౌన్సిల్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

వేడుకగా ఎకనా ప్రెన్యూర్స్ ఫెస్ట్-2025


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్య అతిథి సరిత అధ్యాపకులు

కంచరపాలెం: ప్రపంచ వ్యాపారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎకనా ప్రెన్యూర్స్ ఫెస్ట్-2025ను శనివారం వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త సరిత పాల్గొని మాట్లాడారు. పలు సాంస్కృతిక పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ మంగవేణి, రమణీలత, వసంత, గాయిత్రి, మౌసమి, పావని, యోజన, డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని ఆరాధిద్దాం


మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న వెంకటరమణియాదవ్

మల్కాపురం: మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పూజించి.. పర్యావరణాన్ని కాపాడుదామని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు తోనంగి వెంకటరమణియాదవ్ అన్నారు. 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో శనివారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణనాథులు సముద్రంలో సులువుగా కరగవు అన్నారు.వీటి వల్ల మత్స్య సంపదకు ఆపద కలగడంతోపాటు పర్యవరణానికి హాని ఏర్పడుతుందని వివరించారు.ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని కోరారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

గోపాలపట్నం: కాకానినగర్‌లో బీటీ రోడ్డు పనులకు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ.19.50లక్షలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, శరగడం అరుణ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

గ్రామ కంఠంపై కన్ను!


గ్రామస్తులు అడ్డుకోవడంతో సగంలో ఆగిపోయిన శ్లాబ్


గ్రామ కంఠం స్థలంలో మార్కెట్ నిర్వాహకులు వేసుకున్న పరదాలు

- ఆ స్థలంలో మార్కెట్ నిర్మాణానికి జీవీఎంసీ యత్నం
- అడ్డుకున్న గ్రామస్తులు
- అమ్మవారి జాతర నిర్వహించడానికి అదే వేదిక అని స్పష్టం
- నిలిచిన పనులు

మల్కాపురం: ఆ గ్రామానికి వందేళ్ల చరిత్ర ఉంది. అంతటి చరిత్ర గల ఊర్లో అమ్మవార్ల పండగ నిర్వహణ కోసం అప్పటి పెద్దలు కొంత స్థలాన్ని కేటాయించారు. నేడు ఆ స్థలంలో గ్రామస్తులు, పెద్దల సూచనలు తీసుకోకుండా మార్కెట్ నిర్మాణం కోసం సన్నాహాలు చేయడం వివాదాస్పదమైంది. గ్రామకంఠంలో జీవీఎంసీ నిర్మాణాలు జరిపితే అమ్మవార్ల జాతరలు ఎక్కడ నిర్వహించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. దీంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది.

ఇదీ విషయం

మల్కాపురం ప్రాంతంలో 1925కి ముందు ప్రస్తుతం ఉన్నహెచ్‌పీసీఎల్,ఐవోసీ కంపెనీ వద్ద ఉండేది. నాడు కాల్‌టెక్స్ (ప్రస్తుత హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ),ఎస్ఎఫ్ కంపెనీ,బర్మాసెల్ వంటి పరిశ్రమల నిర్మాణాల కోసం అక్కడ సుమారు 800 ఎకరాల భూమి తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న మల్కాపురం వద్ద 1927లో 29.25 ఎకరాల భూమిని ప్రజల నివాసాల కోసం కేటాయించారు. సుమారు 12 కులాల వారు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. గ్రామ సరిహద్దు ప్రాంతమైన ఏడుగుడులు సెంటర్ (ప్రస్తుత ప్రకాష్‌నగర్ ఉన్న ప్రాంతం) వద్ద కుంచమాంబ,దుర్గమాంబ,ముత్యమాంబ అమ్మవార్లను నెలకొల్పి నిత్య పూజలు చేస్తున్నారు. ప్రతి ఏటా పండగ, మూడేళ్లకు ఒక్కసారి అమ్మవార్ల ఉత్సవాలను నిర్వహించేందుకు మల్కాపురం మధ్యలో (ప్రస్తుతం నిర్వహిస్తున్న మార్కెట్ స్థలం)సదరం పట్టుకు సుమారు 15 సెంట్లు భూమి ఉంది. అక్కడే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే ఆ స్థలంలో జీవీఎంసీ అధికారులు మార్కెట్ నిర్మాణం కోసం పదేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. కొంత భాగం శ్లాబ్ వేశారు. విషయం తెలుసుకున్న గ్రామపెద్దలు,గ్రామస్తులతో కలిసి దీన్ని వ్యతిరేకించారు. దీంతో అప్పటి నుంచి పనులు నిలిచిపోయాయి.

మళ్లీ తెరపైకి మార్కెట్ నిర్మాణం

తాజాగా సుమారు రూ. 40 లక్షల వ్యయంతో మరల మార్కెట్ నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గ్రామస్తుల్లో ఆగ్రహజ్వాలలు మొదలయ్యాయి. సదరం పట్టు స్థలంలో మార్కెట్ నిర్మించాలని యత్నిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతో ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

అనాలోచిత నిర్ణయాలు వద్దు

సదరం పట్టు స్థలంలో మార్కెట్ నిర్మాణం చేయాలనే ఆలోచన సరికాదు.విశాలమైన గ్రామ కంఠంలో ఊరి అమ్మవార్ల ఉత్సవాలను పూర్వీకుల నుంచి నిర్వహించుకుంటున్నాం.ఆ స్థలంలో భవనాలు నిర్మిస్తే మేము ఎక్కడ ఉత్సవాలు చేసుకోవాలి.అధికారుల ఇళ్లలోనా,లేదా పాలకుల ఇంట్లోనా..!.

– కాకర ప్రకాష్‌రావు, హరిజనవీధి,మల్కాపురం

నిర్మాణానికి వస్తే అడ్డుకుంటాం

గ్రామస్తుల ప్రయోజనాలకు ఉపయోగ పడుతున్న స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మించి డబ్బులు దండుకోవాలని చూస్తే సహించబోం. సదరం పట్టు స్థలంలో మార్కెట్ నిర్మించాలనే ఆలోచన విరమించుకోవాలి.ఆ స్థలం అమ్మవార్ల ఉత్సవాల కోసం ఉంచాలి. దానిలో ఎలాంటి నిర్మాణం చేపట్టినా ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతాం.

– బాలుచందర్, శెట్టిబలిజవీధి,మల్కాపురం

కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు


కూటమి మోసాలను ప్రజలకు వివరిస్తున్న రేవళ్ల సత్యనారాయణ తదితరులు

- ప్రచారంలోనే సూపర్ సిక్స్
- వైఎస్సార్‌సీపీ నాయకుడు రేవళ్ల

మల్కాపురం: కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైంది.. సూపర్ సిక్స్ హామీల ప్రచారం పీక్స్ చేరి అమల్లో చతికలబడిపోయిందని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఎద్దేవా చేశారు. వార్డు పరిధిలోని పాతచెక్‌పోస్టు ఏరియా,శాంతిగిరికాలనీలో శనివారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎంత మంది సూపర్ సిక్స్ పథకాలు పొందారు...అర్హత ఉండి పథకాలు రాని వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు,పవన్‌కల్యాణ్ అబద్ధపు హామీలు నమ్మి మోస పోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. రాష్ట్రంలో అప్పుల భారం ఎక్కువ అయిందని,ప్రజలకు సంక్షేమం మాత్రం అందలేదన్నారు. కూటమి నాయకులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దొరికిన కాడికి దోచుకోవడమే ధ్యేయంగా పని చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం


కార్యక్రమంలో పాల్గొన్న కోరమాండల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు

మల్కాపురం: సంస్థలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.శ్రీనివాసరావు అన్నారు. సంస్థ ఆవరణలో శనివారం కాంట్రాక్ట్ కార్మికులకు, ట్రక్ డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న ప్రతి కార్మికుడు ఆరోగ్యంగా ఉండాలని ఏటా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రక్తపోటు, మధుమేహం సమస్య ఉన్న వారికి అవసరమైన వైద్య చికిత్స చేయించడంతో పాటు మందులు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు కె.వి.వి.వై.ఎస్.నారాయణ, రంగనాయకులు,లక్ష్మీనారాయణ,నాగరాజు,డాక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్


దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

మల్కాపురం: ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమవుతుందని వక్తలు, అధికారులు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహించారు. జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం వద్ద వార్డు శానిటరీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ మాట్లాడారు. ప్రజారోగ్యం కోసం అధికారులు, సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. తమ ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు కోరాడ శ్రీను, పాతబత్తుల శ్రీను, శీరం ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

40వ వార్డులో..

సింథియా: ఆరోగ్యకరమైన జీవనం కోసం పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. వార్డు పరిధిలోని ఏకేసీ కాలనీలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ. చికున్‌గున్యా, మలేరియా వంటి వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

62వ వార్డులో..

జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మాట్లాడుతూ ఇళ్ల వద్ద, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధులు వస్తే వెంటనే దగ్గర్లోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, సచివాలయ సిబ్బంది, మలేరియా నివారణ విభాగ సిబ్బంది, ఆర్పీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

63వ వార్డులో..

జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామంలో వార్డు శానిటరీ విభాగం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రపరిచారు. కార్పొరేటర్ గల్లా చిన్నా పాల్గొన్నారు. ఇంట్లో నీటి నిల్వలు లేకుండా కార్యాచరణ చేపట్టాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. సచివాలయ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్పీలు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సహకరించాలి

గోపాలపట్నం: 91వ వార్డు బాజీ జంక్షన్ వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు పాల్గొన్నారు. స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, వార్డు అధ్యక్షుడు నారిపిన్ని సత్తిబాబు, అరుణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

92వ వార్డులో..

జీవీఎంసీ 92వ వార్డు మేహాద్రి గెడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీ పాల్గొని, శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, వార్డు ఇన్‌చార్జి దాడి రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో..

గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయరాదని, ఆయా ప్రాంతాల్లో ఉంచిన డస్ట్‌బిన్‌లలో వేయాలని కోరారు. ప్రమాదకర చెత్త విషయంలో ఆస్పత్రి సిబ్బంది జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

రైతు బజారులో..

గోపాలపట్నం రైతు బజారులో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఈవో ప్రసాద్ రైతులతో, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సహాయకులు శివ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

89వ వార్డులో

గణపతినగర్ శానిటరీ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ పాల్గొని, దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. స్థానికులు, శానిటరీ అధికారులు పాల్గొన్నారు.


గోపాలపట్నం రైతుబజారులో రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో ప్రసాద్


సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు


గోపాలపట్నం సీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపరింటెండెంట్ సుజాత


91వ వార్డులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు

నేడు 61వ వార్డులో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం నగరాలవీధి మైదానంలో ఆదివారం సాయంత్రం బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి (పిలక రాము)తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ హాజరై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు,కార్యకర్తలు హాజరు కావాలని రాము పిలుపునిచ్చారు.

గంజాయి బ్యాగులు లభ్యం!

గోపాలపట్నం: జాతీయ రహదారికి ఆనుకుని ఎస్‌వీకే నగర్ వద్ద తుప్పల్లో గంజాయి సంచులు లభ్యమయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి, దుస్తులు ఉన్న ట్రాలీ బ్యాగులు 2, మామూలు బ్యాగులు 2 ఇక్కడ పార వేశారు. ఇది గమనించిన స్థానికులు 112కి సమాచారమందించారు. దీంతో ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే వాటి వివరాలు పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. ఎన్ని బ్యాగులు దొరికాయి..వాటిలో గంజాయి ఎంత ఉందన్న వివరాలు తెలియరాలేదు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు చెబుతున్నారు.

ఫిర్యాదులొస్తే సీజ్ చేస్తాం


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటోస్టాండ్‌లో ఆటోలు అందుబాటులో ఉంచి సహకరించాలని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు సూచించారు. ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ వద్ద శనివారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రయాణికులను నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, అలా చేస్తే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు గిట్టుబాటు కావడం లేదనే విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంచడానికి కృషి


రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్ నూతన విభాగాధిపతి రవిశంకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: తమ విభాగంలోమానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉత్పత్తి పెంచడానికి కృషి చేస్తానని స్టీల్‌ప్లాంట్ రోల్ షాప్ అండ్ రిపేర్ షాప్ విభాగాధిపతి ఎ.రవిశంకర్ అన్నారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన రవిశంకర్‌ను శనివారం ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య నేతృత్వంలో నాయకులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైర్ రాడ్ మిల్, సింటర్ ప్లాంట్ విభాగాల్లోని మెకానికల్ మెయింటెనెన్స్‌లో రవిశంకర్ చూపిన ప్రతిభను గుర్తించి కీలక విభాగానికి అధిపతిగా నియమించారన్నారు. కార్యక్రమంలో డీజీఎం ఆర్. సత్యనారాయణ, టోప్నో, నాయకులు ఎల్.వి. రమణ, ఎస్. మోహన్‌బాబు, పైడి కొండలరావు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ నైపుణ్యానికి ఎన్ఐపీఎం అవశ్యం


స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేతో ఎన్ఐపీఎం కార్యవర్గ సభ్యులు

ఉక్కునగరం: హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యానికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) వంటి వృత్తిపరమైన సంస్థలు అవశ్యకమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే అన్నారు. ఇటీవల ఎన్నికైన ఎన్ఐపీఎం విశాఖ చాప్టర్ కార్యవర్గ ప్రతినిధులు శనివారం ఆయన్ను ఉక్కు పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంస్థల వల్ల హెచ్‌ఆర్‌లో రోజురోజుకు వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవడంతో పాటు దానికి సంబంధించిన జ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం.ఎం. రావు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. చాప్టర్ చైర్మన్‌గా ఎన్నికైన బి. శేషగిరిరావు ఎన్ఐపీఎం ఇటీవల చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. చాప్టర్ కార్యదర్శి డాక్టర్ బి. కృష్ణకుమారి, చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, బ్రహ్మకుమారీలు

అగనంపూడి: అన్ని దానాల కన్నా రక్తదానం మిన్నగా భావించాలని, ఒకరికి పునర్జన్మనిచ్చేశక్తి రక్తదానికి మాత్రమే ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. రాజయోగి ప్రకాశమణి దాదీజీ 18వ స్మృతి దినోత్సవం సందర్భంగా అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అగనంపూడి ఏరియా ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ఇటువంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి యువత రక్తదాన కార్యక్రమంలో విరివిగా పాల్గొవాలన్నారు. కొంతమంది 30 సార్లు కూడా రక్తదానం చేసేవాళ్లు ఉన్నారని, అటువంటి వారు ఎంతో ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, రాజస్థాన్‌లోని సంస్థ మౌంట్ అబూ ప్రతినిధి ఢిల్లీరావు, విశాఖ జిల్లా కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి , అగనంపూడి ఆస్పత్రి పరిపాలనాధికారి రవిరాజు, బ్రహ్మకుమారీస్ వివిధ సంస్థల ఇన్‌చార్జిలు బీకే వేణి, అగనంపూడి ఇన్‌చార్జి రామకోటి, నాయకులు గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, కర్రి దశేంద్ర, విందుల రాజు, డొక్కా రమేష్, కొరాయి జగదీష్ పాల్గొన్నారు.